

# మైగాడ్! పుస్తకాలు కొనడమా! బార్బేరియస్!!

వ్వాట్! బయింగ్ బుక్స్! మైగాడ్! వర్స్ దాన్ సెల్లింగ్ గర్ల్స్ .... పిల్లనమ్ముకోడం కన్నా నికృష్టం. దిస్, మైడియర్ షేక్స్‌పియర్, ఈజ్ బార్బేరియస్ ..... పుస్తకాలు కొండ(వా? డబ్బు పెట్టా? నువ్వు స్టోన్ ఏజ్ మానవుడిలా ఉన్నావోయ్! ఇది ఆంధ్రదేశమనిన్నీ, నువ్వు టెలుగూస్ జాతివాడివనిన్నీ, ఇది ఫలానా యుగ(వనిన్నీ మర్చిపోయావా? నా లెక్చర్లు, పర్శొనివి(ది డాక్టరేట్లకు సరిపడే నా థీసీస్‌లు అన్నీ ఇంతలోనే పరగడుపయి పోయాయటోయ్? వెధవది నాతో కలిసి చుట్టకాల్చటవే( చాలే. అలా చుట్ట కాల్చి జీనియస్సులై పోయినవాళ్లెందరున్నారో తెలుసా?

నోటుబుక్కు తీసి రాసుకో, పుస్తకాల గురించి శాస్త్రకారుడేవన్నాడు? గిరీశంగారి జీనియస్సు, కంఠశోష ఖర్చుపెట్టి గడించిన విచ్చు రూపాయల్ని పుస్తకాలు కొనడానికి తగలెయ్యవలసిందని ఎన్నడూ అన్న పాపాన పోలేదే? అసలు వాడన్న దేవిటీ? బెగ్, బారో ఆర్ స్టీల్. ఇదీ మార్గత్రయం. నీకంతగా పుస్తకాలు చదివేడవాలన్న అఘోరింపు మనసులో తగలడితే బెగ్--ముష్టెత్తి తెచ్చుకో. అది గనక పరువుతక్కువని తోచినట్టాయెనా, ఎరువడుగు. ఈ ఉభయ మార్గాలున్నూ లాభసాటిగాని పక్షంలో--స్టీల్, చోరీ చెయ్యి. గుట్టుచప్పుళ్ళేకుండా ఎత్తుకుపో. మరేవ్వీ తప్పు లేదు. “అఘము బొంద డధిప!” అన్నాడు ఆ శాస్త్రకారుడే.

అంతే తప్పు చచ్చీ చెడీ శాయంగల విన్నపాలన్నీ చేసి, గొప్ప గొప్ప విషయాల్తప్ప మరొహ టెన్నడూ ఆలోచించెరగని ఈ గ్రేట్‌బ్రెయిన్‌ని -- దిగి రాను దిగి రాను దివి నుండి భువి కన్నదాన్ని దింపి మీ ఫాదరుకు సబ్మిట్ చేసేందుకు అంత పెద్ద పుస్తకాల లిస్టు వేయించి, దాన్ని తీరా రొక్కంగా ఫిరాయించాక డామిట్. ఇపుడా డబ్బు పెట్టి నిజంగా పుస్తకాలు కొనేస్తానంటావూ? మైడియర్ వెంకటేశం, దీసీజ్ బేస్ ఇన్‌గ్రాటిట్యూడ్, హిపోక్రసీ, సిగార్సుకీ దానికీ ఉంటుందని పుస్తకాల్లిస్టేస్తే, ఆ పవిత్రమైన డబ్బుని యిలా కర్కశంగా పుస్తకాల మీద తగలేస్తానంటావూ?

అనల్నినాల్సిన పని లేదు. ఇది మీ వంశంలోనే ఉంది. మీ ఫాదర్ ఆడపిల్లల్నమ్ముతాడు. నువ్వు పుస్తకాలు కొంటావు. వ్వేర్ ఈజ్ ది డిఫరెన్స్? నీలో నాగరికత ఎక్కడున్నట్లు? డామిట్! అసలు నువ్వు తెలుగువాడివై యుండి పుస్తకాలు కొంటానని ఎలా అనగలిగావూ అంట!

మన దేశంలో ఇండస్ట్రీస్ పెరగలేదంటే, ప్రాజెక్టులు రాలేదంటే, అందుక్కారణ మేవిటీ? ఇదే. అక్షరాలా ఇదే. ఈ పుస్తకాలు కొనడవనే జబ్బే. ప్రతివాడూ పుస్తకాలు కొండవే? ఊరికోడు కొంటే చాలదూ? అదే నలుగురం ఎరువడిగి తెచ్చుకొంటాం. లేదా దొంగిలిస్తాం. క్రైమ్సు అనగా నేరాలు, నెలకి రెండు వర్షాల్లాగా జరుగుతాయి. నాలుగు డబ్బులు తిరుగుతాయి. కోర్టులు వర్ధిల్లుతాయి. సివిలిజేషన్ ముందుకి నడుస్తుంది. ప్రతివాడూ పుస్తకాలు కొనేస్తే ఇదంతా స్తంభించి పోదూ? కోర్టులు, బంధిఖానాలు, సిగార్సు వగైరా వర్తకవ్యాపారాలు అన్నీ ఆగిపోతాయి. ఆ తరువాత పుస్తకం వ్రాసుకుందుకి మటుకు మెటీరియలేం దొరుకుతుంది? నేరాలు జరక్కపోతే వేటి గురించి రాస్తాం? హత్యా సాహిత్యం హతం ఖతం అయిపోదూ? అన్యాయం హరించిపోతే ఏది నశించాలని రాస్తాం? యింకోటి కూడా నోట్ చేసుకో, అనలే ఆంధ్రలో ప్రతిమూడోవాడూ కవి. అడ్డమైనవాడూ రాసేస్తున్నాడోయ్ అని అడ్డమైనవాడూ ఏడ్చి నెత్తి మొత్తుకుంటున్నాడు. మర్నీలాంటివాళ్లు కూడా బుక్కులికి వందలూ వేలూ గుమ్మరించి కొనేస్తే బుక్కిండస్ట్రీ పెరిగి పోతుంది. రైటర్లు ప్రతిరోజూ తిండి తిండం మరిగి, బలిసి, రాయడం మానేస్తారు. ఆ పైన, యిది లాభసాటిరోయ్ భగవాన్లూ అని ప్రతి రెండోవాడూ కూడ రాయడం మొదలెట్టేస్తాడు. ఇహ నందరూ రైటర్లే, అప్పుడు ప్రతివాడికీ తన పుస్తకాలు చదువుకుందికి

మటుకు తీరుబాటుంటుంది. మరోపాడి చెత్త చదవనవుడు డబ్బు పోసి కొండఁవెందుకని ఎలాగూ కొనరు. చివరికి ఆ విధంగా చూసినా నేడు కాపోతే రేపైనా మళ్లీ పాతపరిస్థితే వస్తుంది. బుద్ధిమంతులంతా బుక్కులు కొండం మానేస్తారు, చూశావా? ఇదీ సైకిల్ ఆఫ్ సివిలిజేషన్. అందువల్ల నువ్విప్పుడు నా సిగార్సు తాలూకు ఫండ్సని అక్రమంగా దుర్వినియోగం చేసి పుస్తకాలు కొన్నప్పటికిన్నీ దానివల్ల సివిలిజేషన్ గాని, బుక్ ఇండస్ట్రీగాని ప్రోగ్రెస్ అవుతుందనుకోకు.

హాయిగా--నీ కంతగా చదవాలీ అని దుగ్ధ వుంటే ఎరువడగవోయ్. దానివల్ల పరిచయాలు ఏర్పడతాయి. బుచ్చమ్మ లాంటి యంగ్ విడోస్‌తో ఏర్పడితే అవి స్నేహాలవుతాయి. ప్రేమగా వికసిస్తాయి. బుక్స్ ఆర్ ది బెస్ట్ కండక్టర్స్ అన్నాడు విద్యుచ్ఛాస్త్రకారుడు. వాటి ద్వారా లవ్‌లెటర్స్ గట్రా అద్భుతంగా బట్వాడా అవుతాయి. ఎవరి పుస్తకం వారు కొనుక్కుని ఎరువడగడం మానేస్తే యింక ప్రేమ కలాపా లెలా సాగేట్టు? అవి ఆగితే సృష్టి స్తంభించిపోతుంది.

అసలు పుస్తకాలు ఎరువు తెచ్చుకోవడమనేది మన ప్రాచీన సాంప్రదాయం. పూర్వం ఇన్ని బుక్కులుండేవా? బుక్కులు కాసినీ తాటాకుల మీద రాసుకున్నారు. కావ్యాలూ అంతే. ఎవడన్నా చదువుకోవాలంటే ఆ కట్టోసా రెరువడిగి తెచ్చుకొని చదువుకు వాపసిచ్చేవారు. ఐదేసారేసి మంది ఈ కాలపువాళ్ళు పేపరు చదివినట్టు--దాని కన్ని వేపులా మూగి నిలువునా అడ్డానా ఐమూలగా తలక్రిందులుగా చదివేసి తలో ముక్క చించుకుపోయి చదివి పరిపరివిధాల ఆనందపడేవారు. సంఘపఠనవఁన్న మాట. అలాగే పుస్తకాలున్నూ, పైగా ఇవి ఎరువడిగి తెచ్చిపడేసుకుంటే ఏదన్నా ఉపద్రవం వచ్చిపడి సిగార్సుకి యిరకాటఁవైనప్పుడు మూర్మార్కెట్లో అమ్మి ఆపద గడుపుకోవచ్చు. ఎరువడగడం లాకాయి లూకాయి విద్య కాదు. ఎ గ్రేట్ ఆర్ట్. మార్క్‌ట్వేన్ అంతటి గొప్పవాడు ఈ విద్యని సాధన చేశాడు. ఒకమారో పెద్దమనిషాయనింటికెళ్ళి గదినిండా కుప్పపోసిన పుస్తకాల్చూసి 'ఏఁవిటి సార్, అలాపడేశా'రన్నాట్ట. "వాట్టుడూ పుస్తకాలెరువిచ్చిన వెధవలు బీరువా లెరువిచ్చారు కారు" అని మండి పడ్డాడు మార్క్‌ట్వేన్.

అంచేత, మైడియర్ వెంకటేశం, నా మాట విను. ఆ డబ్బు తగలెయ్యకు. సిగార్సు అయిపోవచ్చాయి. అవి కొని స్టాకు చెయ్యి. మిగతా డబ్బు నా దగ్గర దాచు. దుర్మార్గాలపడి సంస్కృతి సంప్రదాయాలనూ, మీ నాన్నిచ్చిన ఆ పన్నెండు రూపాయలనూ తగలెయ్యకు ..... అడుగో మాటలో వస్తున్నాడు మీ నాన్న ..... రండి సార్ రండి. ఇదిగో ఇపుడే మీ వాడికి మన సంస్కృతి, ప్రాచీన సంప్రదాయాలు , కోర్టులు, డబ్బు పొదుపు చెయ్యడం, సద్వినియోగ పరచడం అనే విషయాలను గురించి బోధపరుస్తున్నాను. చిత్తం యాఁవన్నారూ? ఎంతమాట ..... లేకేం .....

ఈ విషయాలన్నింటికీ సంబంధం ఉండకేం? కావలసినంత ఉంది. నిజానికన్నిటి సారంశం ఒకటే. సిగార్స్ ఫస్ట్ అన్నట్టు. అయినా కాపోయినా దొరల్చదువు లదో మోస్తరు లెండి. వాళ్లెంతసేపూ బుక్స్ బుక్స్ అంటారు. మీవాడికింకా పుస్తకాల విలువ బాగా తెలీలేదు. యంత సేపూ పూత చుట్టలూ, చేగోడీలూ, బైస్కోపుకాలపు మంచి పుస్తకాలు కొని చదవాలన్న బుద్ధి బాగా పట్టుబళ్ళేదు. మీరు పదో పన్నెండో యిచ్చార్ట. పుస్తకాలకిది చాల్దా అంటాడు. మరేం లేదు, యింకో టెన్ రుపీస్.... ఒక పదిరూపాయలు మంజూరు చేస్తిరా ఇహ నీ యేడాదికీ పుస్తకాల్చాలు. ముఖ్యమైనవి మరికొన్ని కొనాల్లెండి .... చిత్తం చిత్తం. అలాగే కానీండి, ఐదే చాలు అదే పదివేలు.

[ పాఠకులు నా మాటలు నాకు అప్పగించేరు సుమా. నా పుస్తకాలు మటుకు తప్పక కొనండి. అన్ని శాస్త్ర నియమాలకూ అపవాదులంటూ ఉంటాయి కదూ మరి!]

